

# గడియ

"...." వర్షం హోరు జవాబిస్తున్నది.

ఆదుర్దాగా రావిచెట్టుకేసి దౌడు తీశాడు. పక్కనే గడ్డివేటు. లాంతరు పైకెత్తి, "లచ్చి" అని పిలవబోయాడు. నిలువునా నీరయ్యాడు— పక్కన చుట్టు గుడిసెలో సంభాషణ విని.

"ఛీ! నోర్మూయ్, దొంగసచ్చినోడా! గొడ్డల్లే నన్ను చెరిచినా...." అంటూ గద్గద కంఠంతో అరుస్తూ, తాగిన నిషాలో వెకిలిగా, క్రూరంగా

వస్తూవున్న నాగులు పట్టునుండి విడిపించుకుని బయటపడింది అపవిత్రమైన శరీరంతో లచ్చి.

చేతిలాంతరుతో దిమ్మెరపోయిన క్రిష్నయ్యను చూసి, "మామా" అంటూ గొల్లుమని పరుగు తీసింది తమ్ములేటి గట్టుకేసి చీకట్లో.

గళ్లలుంగీ గట్టిగా బిగించుకుంటూ బయటికి వచ్చాడు నిషాలో నాగులు.

"నాగులూ!" క్రిష్నయ్య గర్జన, చింత నిప్పులలా ఉన్న కళ్లతో! తోడుగా ఫెళఫెళ మంటూ ఉరిమింది ఆకాశం.

క్రిష్నయ్య పడుచురక్తం పెల్లుబికింది. వేడి రక్తం శరీరం అంతటా వేగతో పరుగులెత్తింది.

అటువైపు లచ్చి పారిపోతున్నది—జీవితం నుండి.

"లచ్చీ!" గట్టిగా అరిచాడు క్రిష్నయ్య. వేగంగా పరుగెత్తాడు లచ్చికోసం.

"నీకొద్దు, మామా, ఈ ఎంగిలి లచ్చి!" ఇంకేమేమో అంటూ దూరమైపోతున్నది. వర్షం జోరుగా కురుస్తున్నది. గాలి హోరున వీస్తున్నది.

"లచ్చీ! ఆగు!" అంటూండగానే ఏటిలో బుడుంగుమనే శబ్దం అయింది పెద్దగా. ఏటి గట్టెక్కుతున్న క్రిష్నయ్య, శబ్దంవిని మ్రానై పోయాడు. ఫలితం? గట్టుమీదనుంచి బండలో లాంతరుతో జారిపోయాడు కిందికి. గాజు చిప్పు పగిలి, మీదపడిన క్రిష్నయ్య రెండు చేతుల్లోనూ బలంగా గుచ్చుకుంది. క్రిష్నయ్య దీపం ఆరిపోయింది. ఆకాశంలో మెరుపు. మెరుపులో కనిపించింది రెండు అరిచేతుల్లోనుంచి వస్తున్న ఎర్రటి ఉడుకురక్తం. వర్షం నీళ్లు ఆ రక్తాన్ని కడిగేస్తున్నాయి ప్రేమగా. ఆకాశం

# గడియ

విరిగి భూమిమీదపడ్డట్లు దూరంగా ప్రచండమైన పిడుగు. భూమి దద్దరిల్లింది.

రెండు క్షణాలు విద్యుద్ఘాతమైనట్లుయింది క్రిష్నయ్యకు. అంతా చీకటి. ఏమీ కనిపించలేదు. అంతా నిశ్శబ్దం. ఏమీ వినిపించలేదు. కొయ్యబారిన క్రిష్నయ్యకు దూరమైపోయింది లచ్చి శాశ్వతంగా. బుసలుకొడుతున్న ఏటిలో వెదికాడు. అప్పటికే తన వశం చేసుకుంది రంకెలు వేస్తున్న ఏరు. "లచ్చీ! లచ్చీ!" పిచ్చిగా, ప్రేమతో ఏమో అరిచాడు. పిలిచాడు. కాని ఉలుకులేదు, పలుకులేదు.

వాన పడుతూనే ఉంది. మెరుపుల బీభత్సం తగ్గలేదు.

దూరంగా నాగులు గుడిసె. మినుకు మినుకు మంటున్న బుడ్డిదీపం. ఓమాదిరి చిన్న గుడిసె. రంయిమంటూంది సుడిగాలి. హోరుమంటూంది జడివాన. పగతో, కసిగా పడుతున్నాయి క్రిష్నయ్య అడుగులు గుడిసెకేసి వేగంగా, బలంగా. తళుక్కుమంది మెరుపు ఆకాశంలో. క్రిష్నయ్య చేతిలో గండ్రగొడ్డలి పదును జవాబిచ్చింది మెరుపుకి తళుక్కుమని. గుడిసెలో నుంచి నిషా నాగులు పొలికేకలు వినిపిస్తున్నాయి. రెండు చేతులూ సలుపుతున్నాయి గాయాలకు.

క్రిష్నయ్య శరీరం అంతా 'పగ'కు బానిసైపోయింది. ఓసారి గండ్రగొడ్డలికేసి చూసి, కసిగా పళ్లు బిగించాడు. నాగులుకోసం క్రిష్నయ్య గుడిసెవైపు వడివడిగా నడిచాడు.

"నాగులూ!" మళ్లీ పిడుగు పడ్డంత గర్జన. వాన చినుకుల్లో తూలుతూ గుడిసె బయటికి వచ్చాడు నాగులు. తళుక్కుమని మెరుపు. క్రిష్నయ్య చేతిలో గండ్రగొడ్డలి బలంగా లేచింది గాలిలోకి. ఫలితం? క్రిష్నయ్యకు పదిహేనేళ్ల కఠిన శిక్ష!

వదలలేక వదలలేక వదిలి వెళ్లాడు చిన్నారి చిట్టి జానకిని నాయుడుగారి సంరక్షణలో. నాయుడుగారికి పిల్లల్లేరు. నెల్రకితమే భార్య పోయింది. అందుచేత ముక్కల్లో పెట్టి చూసుకుంటానన్న ఆయన మాటల్లో నమ్మకముంది క్రిష్నయ్యకు.

* * *

జైలు గోడ నీడ వసుంధరను కౌగలించుకుంది. ఎత్తు గోడలు చుట్టూ గట్టి కాపలా కాస్తున్నాయి. కటకటాల్లోనుంచి ఎదురుగా కనిపిస్తున్న మర్రిచెట్లకేసి, నిశ్శబ్దంగా ఉన్న ప్రకృతికేసి మౌనంగా చూస్తున్నాడు క్రిష్నయ్య. కాలాన్ని కొలుస్తూ టంగ్‌టంగ్‌మంటూ మోగింది జైలుగంట పదిసార్లు.

వెన్నెల్లో ఎదురుగా ఓ యువతి తెల్లచీరలో, మల్లెపూలతో దగ్గరగా వచ్చింది. ఆమె....ఆమె... ఎవరోకాదు—తన జానకి! తన జానకి! ఆనందం అవధులు దాటింది క్రిష్నయ్యకు. "జానకీ!" ఆనందంగా అన్నాడు. "నాన్నా!" ఆనందం, దుఃఖం కలిసిన కన్నీరు కారుతుంటే జవాబిచ్చి తండ్రిని చుట్టేసింది. క్రిష్నయ్య తనివితీరా తలనిమిరాడు. ముచ్చట తీరేటట్లు ముద్దుపెట్టుకున్నాడు వాత్సల్యంతో.

"నాన్నా! నువ్వు తొందరగా వచ్చేయి, నాన్నా!" తండ్రిని గట్టిగా పట్టుకుని అడిగింది జానకి.

"ఓ! ఇంకెంతమ్మా—రెండు నెలలేగా?" ఆనందంగా అన్నాడు.

"నాన్నా!"

"జానకీ!"

జానకిని కౌగలించుకుని అలానే ఉండి పోయాడు మైమరిచి. అరగంట అని అరుస్తూ జైలు బెల్లు లంగుమంది గట్టిగా.

ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు. జానకిలేదు. అంతా కల. భ్రమ. మనస్సు చివుక్కుమంది. విడుదలకోసం వెయ్యికళ్లతో ఎదురు చూశాడు.


ఆ గడియ రానే వచ్చింది. క్రిష్నయ్యకు ఆత్రుత ఎక్కువైంది. తొందరగా పడుతున్నాయి అడుగులు బోదెగట్టుమీద. పదిహేనేళ్ల క్రితం వదిలిన చిట్టి జానకి ఎలా ఉందో? ఏం చేస్తున్నదో? తన జానకికి పట్టుకొస్తున్న పట్టుచీరె పొట్లాన్ని గట్టిగా పట్టుకుని బోదె గట్టెక్కబోయాడు. తొట్రుపాటుతో కుడికాలుజారింది. పొట్లం జారిపోబోయింది. క్రిష్నయ్య గుండె ఒక్కసారి దడదడలాడింది.

దూరంగా కనిపిస్తున్నది పెద్ద పట్నమైపోయిన పల్లెటూరు మునిపాడు. విద్యుద్దీపాల కాంతిలో, పెద్ద పెద్ద భవనాలతో అందంగా ఉంది, నిద్రకు ఉపక్రమిస్తున్నది. ఊరు దగ్గరవుతున్నకొద్దీ కుక్కల బౌంయ్ బౌంయ్‌లు,

## రాత్రింబవళ్ళ సరిహద్దు

ఫోటో—సి.హెచ్. సుబ్రహ్మణ్యం (విశాఖపట్టణం-1)





సంధ్య

ఫోటో—సోమయాజులు (పాండిచేరి)

గూర్ఖా ఈలలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

జానకి నవ్వు కళ్లముందు మెదిలింది. కళ్లతో పలకరిస్తూ అచ్చి కనిపించింది అంతరాత్మకు. క్రిష్ణయ్య కళ్లు తుడుచుకున్నాడు.

మాసిన గడ్డం, చినిగిన గుడ్డలు, శుష్కించిన శరీరం. లోతుకుపోయిన కళ్లు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి ఎలక్ట్రిక్ దీపం వెలుగులో.

'ఊరు బాగా మారిపోయిందే! అసలు నాయుడు బాబుగారు నన్ను గుర్తుపడతారా!' అనుకొంటూ తన ఆశ్చర్యాన్ని నిద్రిస్తున్న ప్రకృతికి తెలియచేశాడు క్రిష్ణయ్య.

'ఆఁ ఆఁ అల్లదే! పెంకుటిల్లు. చుట్టూ సిమెంటురాళ్లగోడ. ఇంకాదీపం వెలుగుతున్నదేం?' ఆనందంగా అనుకున్నాడు క్రిష్ణయ్య, వీధి చివర మలుపుతిరిగి.

పెంకుటిల్లు దగ్గరైంది. వీధి తలుపు వేసి ఉంది. పక్కగా వెళ్లాడు. సిమెంటు రాళ్ల గోడ. పక్క సరిహద్దు రాయిమీద కెక్కి గోడ మీదనుంచి కిటికీలోకి చూశాడు. బయట అంతా చీకటి. ఇంటిలో విద్యుద్దీపం వెలుగు.

ఎదురుగానాయుడుగారి ఫోటో పూలదండతో. నెత్తిన పిడుగుపడ్డట్లయింది క్రిష్ణయ్యకు. పక్కనే ఎవరిదో యువదంపతుల ఫోటో. ఇంతలో క్రిష్ణయ్య కళ్లు మంచంమీద పరీక్షగా వెతికాయి. పడుచు జానకి తెల్లచీర కట్టుకుని ప్రశాంతంగా పడుకుంది. నిస్సందేహంగా ఆమె తన జానకి! అదిగో కుడివైపున బుగ్గమీద పుట్టుమచ్చ. మెడలో మాంగల్యం తళుక్కుమంది దీపంకాంతిలో. క్రిష్ణయ్య ఒళ్లు పులకరించింది. కళ్లు జ్యోతుల్లా వెలిగాయి. నాయుడుగారి ఫోటోకు కృతజ్ఞతతో నమస్కరించాడు. జైల్లో కలలో కనిపించి "త్వరగా వచ్చేయి, నాన్నా!" అన్న జానకి మాటలు చెవుల్లో రింగుమన్నాయి.

"ఇదుగో, తల్లీ, వచ్చేశా" అంటూ ఉత్సాహంగా వీధి తలుపు తట్టాడు గోడమీదనుంచి దిగి, తలుపు దగ్గరకువచ్చి. 'నా జానకి వస్తుంది! తలుపుతీసి, "నాన్నా" అంటూ కౌగలించుకుని బావురుమంటుంది. "పిచ్చితల్లీ! ఎందుకమ్మా ఏడుపు? వచ్చేశానుగా?" అని తల నిమురుతూ అనాలి తను' అనుకొంటుండగానే కళ్లు రెండూ చెమ్మగిల్లాయి.

"జానకీ!" కళ్లు తుడుచుకుంటూ గట్టిగా పిలిచాడు.

"ఎవరది?" తలుపుతెరుస్తూ ఎవరో యువకుడు. వెనకే నిద్ర కళ్లు నులుముకుంటూ జానకి. ఎదురుగా ఎలక్ట్రిక్ దీపాల మధ్య ఫోటోలో నవ్వుతున్న నాయుడుగారు. మళ్లీ గతుక్కుమన్నాడు.

"తల్లీ! జానకీ! రా, అమ్మా! వచ్చేశాగా?" ఆత్రుతగా చేతులుచాపి లోనికి అడుగు వేయబోయాడు.

చెంప ఛెళ్లుమంది. తూలి కిందపడ్డాడు యువకుడి దెబ్బ ధాటికాగలేక.

"పిచ్చివెధవ! ఫో అవతలికి!" గర్జిస్తూ కాలరు పట్టుకుని బలంగా తోసేశాడు కిందికి. చేతిలో పట్టుచీర పొట్లం కిందపడింది. బాధగా, బరువుగా లేవబోయాడు. తపీమని తగిలింది యువకుడు కాలితో తన్నిన పట్టుచీల పొట్లం. రెండు కళ్లూ అశ్రువులతో నిండాయి. పొట్లం మీద టపటపమని రెండు కన్నీటి బొట్లు పడ్డాయి. తలుపులు రెండూ శబ్దం చేస్తూ మూసుకున్నాయి. "ప్చ్! పాపం! పిచ్చోడు" అంటున్న జానకి మాటలు అస్పష్టంగా వినిపించాయి క్రిష్ణయ్యకు.

"పిచ్చోణ్ణి! పిచ్చోణ్ణి!" మతిభ్రమించిన క్రిష్ణయ్య గావుకేకలు భయంకరంగా, వికృతంగా నిశీధిలో మారుమోగుతుంటే, ప్రకృతి దద్దరిల్లింది.

ఆ గడియలోనే వేసుకుంది అటు తలుపులకు, ఇటు వాత్సల్యానికి గడియ. ★